# దైవలిఖితం

సి.డి.యస్. రామయ్య

ఒకసారి పార్వతీపరమేశ్వరులు, భూలోకంలోని ప్రజల సుఖదుఃఖాలను ప్రత్యక్షంగా చూసి రావడానికి బయలుదేరారు. ఒక్కొక్క వూరూ - అలా చూసుకుంటూ వస్తూండగా, ఒకచోట ఆగవలసివచ్చింది.

అదొక చిన్న పల్లె; ఆ పల్లెచివర ఒక చిన్న దేవాలయం; దాని ప్రక్కగా ఒక తామరగుంట. దానికి సమీపంలో ఓ చిన్న గుడిసె. ఎంతటి చిన్న గాలికైనా ఉన్నపళంగా కూలిపోగలిగినంత దీనస్థితిలోవుందా గుడిసె. ఆగుడిసె గుమ్మందగ్గిర ముగ్గురు-ఒక భిక్షుక బ్రాహ్మణుడూ, అతని భార్యా, వారి కొడుకూ - బక్కచిక్కిన శరీరాలతో విచారంతో కూర్చుని వున్నారు. ఆ రోజు వాళ్ళకు ఒక్క బియ్యపుగింజైనా భిక్షం దొరకక పోవడంచేత, వారికి ఆ పూట తిండి లేదు. వారి కడుపుల్లో ప్రేవులు ఆకలికి ఆవులించాయి!

సర్వజ్ఞులయిన దేవతలకు ఇవన్నీ తెలియకపోతాయా? ఆ భిక్షుక కుటుంబపు దీనస్థితికి పార్వతిదేవి మనస్సు చివుక్కుమని బాధపడ్డది. మనస్సువుండబట్టక పరమశివుడితో: "ప్రభూ! వాళ్ళంత దారిద్ర్యం అనుభవించడానికి వాళ్లేం పాపం చేశారని? పాపం! వాళ్ళెలా బాధపడుతున్నారో చూడండి! ఎందరో భక్తుల కష్టాలను తీర్చిన మీకు, వాళ్ళమీద జాలి కలగడంలేదా?- మీ మనస్సు రాయా యేమిటి?" అంది, కళ్ళనీళ్లు పుట్టుకొస్తూండగా.

"పార్వతీ! ఇందుకు మనం చేయగలిగిందేమీ లేదు. వారివారి విధిలిఖిత ప్రకారమే, ప్రతిదీ జరిగితీరుతుంది గాని, ఒకవేళ మనం వాళ్లకి సహాయం చేసినా, వాళ్ళ దారిద్ర్యం తీరదు. కాబట్టి, ఇక్కడ వుండడంవల్ల యేం ప్రయోజనం లేదు; రా వెళ్దాం—" అన్నాడు పరమశివుడు.

"ఇవేం మాటలు ప్రభూ... దయాసముద్రులు, సర్వేశ్వరులు అయిన మీవల్ల సాధ్యం కానిదేముంది?— వాళ్ల కష్టాలు కళ్ళారా చూసీ, మనం వాళ్లను రక్షించకపోతే మనకున్న గౌరవమేమిటి?" అంది పార్వతి.

ఆమె మాటలు విని పరమశివుడు నవ్వాడు: "నిజమే పార్వతీ!-కానీ, నిన్ను లోకమాతా, ఐశ్వర్యదాయినీ, దారిద్ర్యనాశనీ అంటూ భక్తులు సేవించుట లేదా? అదీగాక 'శక్తి' లేనిదే శివునకు మహిమ ఎక్కడుంది? నాకున్న మహిమ అంత నీకూ వుందిగా! నీవైతే వెళ్లి, వాళ్ళకేదేనా సహాయం చెయ్యి. విధిలిఖితాన్ని కాదని, సహాయం చేయడం నావల్లమాత్రం సాధ్యం కాదు" అన్నాడు.

పార్వతీదేవికి - ఆ భిక్షుకకుటుంబానికేదేనా సహాయం చేసితీరాలనే పట్టుదల యేర్పడింది. కాబట్టి, శివుడు యెంత చెప్పినా వినకుండా, వాళ్ళవద్దకు బయలుదేరింది.

పార్వతీదేవి ముసలిరూపం ధరించి భూలోకంలోని ఆ గుడిసె వద్దకు వచ్చి, ఆ బ్రాహ్మణుని పిలిచి, "బ్రాహ్మణోత్తమా! మీరనుభవిస్తున్న కష్టాలను చూసి, జాలిపడి, మీకేదేనా సహాయం చేయాలని వచ్చాను. మీలో ఒక్కొక్కరికి ఒక్కొక్క వరం ఇవ్వబోతున్నాను. ఆ వరాలేమిటో మీరు కోరుకొని, వాటిమూలంగా మీ దారిద్ర్యాన్ని పోగొట్టుకుని, హాయిగా జీవించండి" అంది.

తమ కష్టాలను చూసి జాలిపడిన ఆ ముసలామెను - ఎవరో పిచ్చిదై వుంటుందని అనుకున్నాడు బ్రాహ్మణుడు. ఆమెను చూసి "ఎవరమ్మా నువ్వు? మాకున్న కడుపుమంటలు చాలక, నువ్వు వరాలివ్వడానికి వచ్చాననడంకూడా మరొక కడుపుమంటా? నువ్వేం వరాలివ్వనవసరం లేదుగాని, నీ దారిన నువ్వు వెళ్లు!" అన్నాడు.

బ్రాహ్మణుని అలక్ష్యానికి, పార్వతీదేవి కాస్త ఆవేశపడినా, తన పట్టుదలను తీర్చుకోడానికై-"మీకు

# ★ దైవలిఖితం ★

నా రూపాన్ని నమ్మలేకపోవచ్చు; కాని, నేనిచ్చే వరాలను నమ్మవచ్చు. ఇదిగో, మీ ఒక్కొక్కరికీ ఒక్కొక్క వరం యిస్తున్నాను. మీరు ఒక్కొక్కరూ మీకిష్టమైన దేదో మనస్సులో తల్చుకుని, పక్కనున్న తామరగుంటలో తల మునిగి లేచారంటే, అది మీకు సిద్ధిస్తుంది" అంది.

"నిజంగానా?" అన్నాడు బ్రాహ్మణుడు.

"సందేహమెందుకూ? నేను చెప్పిన విధంగా చేయండి...ఆ తర్వాత మీకే తెలుస్తుంది" అని చెప్పి అంతర్ధానమయింది పార్వతీ దేవి.

ఎదుట మాట్లాడిన ముసలి రూపం వున్నట్టుండి మాయమయ్యేసరికి, ఆ బ్రాహ్మణుడికి ఆవిడమాటల్లో నమ్మకం యేర్పడింది. ఇదంతా భగవంతుడి మాయలీలగానే వుంటుందని, వాళ్లు ముగ్గురూ గ్రహించారు. ప్రాణాలు విడిపోయేటంత ఆకలి వున్నా, దాన్ని లక్ష్యం చేయకుండా, వాళ్లు ముగ్గురూ కలిసి కర్తవ్యమేమిటని ఆలోచించసాగారు. "అదృష్టం మనల్ని వెతుక్కుని వస్తూండగా, నేను రాజుగా యెందుకు కాకూడదు? రాజునైతే రాజ్యాలేలవచ్చు; పెద్దపెద్ద అంతఃపురాలలో హాయిగా వుండవచ్చు. చేతికి అందని ఆనందాలన్నీ అనుభవించవచ్చు" అన్నాడు బ్రాహ్మణుడు. బాగుందన్నారు మిగతాయిద్దరూ.

అంతలో, బ్రాహ్మణుడి కుమారుడు, "నాన్నా!... నువ్వు రాజవైతే, రాజ్యాలేలుదువా, ఆనందాల్ని అనుభవించుదువా? దేశాన్నీ, ప్రజల్నీ, కాపాడడానికి ఒక సైన్యాధిపతి అవసరం కదా? ఆభారాన్ని నేను తీసుకుంటాను. నువ్వు హాయిగా సుఖాల్ననుభవిస్తూ కూర్చుండవచ్చు" అన్నాడు, తెలివిగా.

"భేష్! బాగుంది నీ యోచన! ఇప్పటినించీ నువ్వు నా సేనాధిపతివి" అని కొడుకును మెచ్చుకున్నాడు బ్రాహ్మణుడు.

ఇంతవరకూ వాళ్ళ మాటలు వింటూ, వూరక కూర్చున్న బ్రాహ్మణుని భార్య "మీరు రాజుగారూ, అబ్బాయి సేనాధిపతిగారూ కావడం బాగానే వుంది. కాని, నా సంగతేమిటి? - నాకేం తోచడం లేదు" అంది, భర్తతో.

భార్య అమాయకత్వానికి బ్రాహ్మణుడు: "నువ్వా-నువ్వా?- ఓసీ పిచ్చిదానా! ఎంత అమాయకురాలివే! నేను రాజునైతే, నువ్వు రాణివవుతావు! సింహాసనములో నా ప్రక్కన కూర్చొని, అందరి చేతా పనులు చేయించుకునే మహారాణివవుతావు. ఇంకేం తక్కువ నీకు?" అన్నాడు. బ్రాహ్మణుని భార్య ఆనందంతో నిండిపోయింది.

తమ తమ కోరికలను నెరవేర్చుకోడానికి ముగ్గురూ, తామరగుంట దగ్గరకు చేరారు. మొదట, తనభార్య రాణి కావడం కళ్లారా చూడాలని అనుకున్నాడు బ్రాహ్మణుడు. కాబట్టి, తన భార్య నుద్దేశించి: "ఇదిగో, చూడూ! నీ మనస్సులో-లోకంలోకల్లా అందమైన పడుచుగా మారాలని, రాణివకావాలని కోరుకుని, నుప్వీగుంటలో తల మునిగి రా!" అన్నాడు. తనకు అందమైన పడుచురూపం రాబోతుందని తలుచుకుని బ్రాహ్మణుని భార్యకు ఒళ్లు పులకరించింది. భర్త మాట ప్రకారమే, మనస్సులో తలుచుకుని, గుంటలో తలమునిగి లేచింది. ఆశ్చర్యం! ఆమె సుందరమైన-పద్దెనిమిదేళ్ళ వయస్సుగల లావణ్యవతిగా మారిపోయింది. తన భార్య అంత అందవతిగా మారిపోవడం చూసి, బ్రాహ్మణుడూ, వారి కొడుకూ, ఆశ్చర్యపడిపోయారు. ఆమెను వాళ్ళలా చూస్తూనిల్చున్న సమయంలో-ఎవరూ ఎదురుచూడని విధంగా మరొకటి జరిగింది.

వేటకు వెళ్లి తిరిగివస్తున్న ఆ దేశపు సుల్తాను - ఆసమయంలో, అటుపక్కగా వస్తూ-బ్రాహ్మణుని భార్యను చూడడం తటస్థించింది. సాటిలేని రూపవతి ఒకతె కనిపించితే, ఆ సుల్తాను వూరికే వదిలిపెట్టగలడా? - తన సిపాయీలకు - "ఈ సుందరవతి యిక్కడుండడం దేనికీ? మన అంతఃపురానికి తీసుకురండి!" అని హుకుం జారీచేశాడు. బ్రాహ్మణుడు దిగ్భ్రాంతుడయాడు; కనుమూసి తెరచేంతలో, సిపాయీలు ఆ అందాలరాణిని పల్లకీలో కూర్చొనపెట్టారు. ఆమె భయంతో అరుస్తూండగా, సిపాయీలూ, సుల్తానూ అక్కడినుంచి వెళ్ళిపోయారు.

నిమిషంలో జరిగిపోయిన ఈ హడావిడికి, బ్రాహ్మణుడి కళ్ళు చింతనిప్పులైపోయాయి. ఆవేశం అణచుకోలేక, మొలనున్న కరవాలాన్ని దూయబోయాడు. కాని,

అతని చెయ్యి అతని తొడమీద పడింది. "ఓహో! నే నింకా తల మునిగి రాజు కాలేదుగదా!" అనుకున్నాడు. కాని అందమైన భార్యను చేజేతులా విడిలించుకోవడంవల్ల అతని మనస్సు వుండబట్టలేకపోయింది. చేసేదిలేక ఆవేశంతోనూ, విచారంతోనూ – భార్య నెత్తుకు పోయిన సుల్తానును నోటికొచ్చినట్టు బూతులు తిట్టడం ప్రారంభించాడు. అతని కొడుకూ ఏడవడం మొదలెట్టాడు...భార్య పోయిందన్న విచారంతో–కొంత సేపటికి స్పృహ తప్పి నేలపడిపోయాడు బ్రాహ్మణుడు.

ఆ తర్వాత కొంతసేపటికి బ్రాహ్మణుడు మూర్ఛనుండి లేచాడు. కలలోలాగా జరిగిపోయినదంతా తల్చుకుని – తన భార్యను ఎత్తుకుపోయిన ఆ సుల్తానును చంపి తీరాలనుకున్నాడు. కాని, ఆ సుల్తాను ఎక్కడ? తనెక్కడ? అదెలా సాధ్యం అవుతుంది? అనుకుని ఆలోచించాడు. తను రాజైతే సైన్యాన్ని సేకరించుకుని, సుల్తాను మీద దండెత్తవచ్చుననీ, సుల్తానును చంపి, తన భార్యను తీసుకు రావచ్చుననీ అనుకున్నాడు. ఈ విషయంలో అతనికి రామాయణ గాథ జ్ఞాపకం వచ్చింది. ఒకవేళ రాజునై సైన్యాన్ని కూడగట్టుకుని, సుల్తానుమీద దండెత్తిన తర్వాత, జయం సుల్తానుకు కలిగి, తనకు అపజయం కలిగితే, తన భార్య గతి ఏమవుతుంది? అనుకున్నాడు. కాబట్టి, తన బుద్ధిబలంతో తప్ప, సుల్తానును మరేవిధంగానూ జయించలేనని తెలుసుకున్నాడు. ఆ ఉపాయమేదో ఆలోచించసాగాడు.

ఆఖరికి మెరపులా ఒక యోచన తట్టింది అతనికి! 'ఒరే, సుల్తాను పాతకా! – ఇదిగో నీ పని పట్టిస్తాను' అనుకుని, ఆ ఆలోచనేదో కొడుకు దగ్గరకూడా చెప్పకుండా, బిరబిరా గుంటలోకి వెళ్ళి, తల మునిగాడు బ్రాహ్మణుడు.

పల్లకీలో తీసుకపోతున్న బ్రాహ్మణుని భార్యను యెన్నో విధాలుగా తన వశం చేసుకోడానికి ప్రయత్నం చేశాడు సుల్తాను. కాని, ఆమె ససేమిరా – ఏడుస్తూ కూర్చుంది. సుల్తాను, తను వేసుకున్న ఒక ముత్యాలహారాన్ని ఆమె మెడలో వేయబోతున్న సమయంలో, బ్రాహ్మణుని భార్య పందిగా మారిపోవడం జరగడంతో– జరిగిన ఈ విచిత్రానికి ఆవేశపడి, "ఇదేమిటి విచిత్రం! సైతాన్!" అంటూ దాన్ని కాలితో తన్ని–పల్లకీనుండి దిగాడు. పల్లకీనుండి నేలపడ్డ పంది, సుల్తానును చూచి ఉరిమింది. దాన్ని అంతటితో వదిలిపెట్టి, సుల్తాను తన సిపాయీలతో వెళ్ళిపోయాడు.

కొంతసేపటితర్వాత, పందిరూపమెత్తిన బ్రాహ్మణుడి భార్య, తనకేసి రావడం చూసి దిగులు చెందిపోయాడు బ్రాహ్మణుడు. 'ఆఖరికి ఈ పందితో నా జీవితం గడపాలని వుందా!' అని విచారించేడు. ఏదో ఆవేశంకొద్దీ, తన భార్యను సుల్తాను నుండి విడిపించుకోవాలనే వుద్దేశంతో – సుల్తానుదగ్గరున్న ఆమె పందిగా మారాలని మనస్సులో కోరుకుని, నీటిలో మునిగాడేగానీ, ఆమె యెప్పుడూ పందిగా వుండవలసివస్తుందని అతనూహించలేకపోయాడు. చేజేతులా చేసుకున్న దానికి విచారపడుతూ కూర్చున్నాడు బ్రాహ్మణుడు.

అప్పుడు బ్రాహ్మణుని కుమారుడు: "నాన్నా! విచారపడకు. ఇప్పటికైనా యేమీ మించిపోలేదు! ఇంకొక వరం నావంతు బాకీ వుంది గదా! దానికి, మొందున్నలాగే అన్నీ మారిపోవాలని కోరుకుని, నేను తలమునుగుతాను" అన్నాడు.

కొడుకు బుద్ధిమతిమాటలకు బ్రతుకు జీవుడా అనుకుని, 'అమ్మయ్యా!' అని నిట్టూర్చాడు. బ్రాహ్మణుని కుమారుడు చెప్పిన విధంగానే కోరుకుని తల మునిగి లేచాడు. పందిరూపంలో వున్న బ్రాహ్మణుని భార్య, పూర్వంలాగా మామూలు బ్రాహ్మణుని భార్యగా

---

## ఏకాకి

(౩౭-వ పేజీ తరువాయి)

కష్టంగా కట్టు ఎంతకాలం నిలబడగలుగుతుంది! ఆమె చిట్టిపావని మళ్ళీ ఒకసారి చేతుల్లోకి తీసుకుంటూ "ఇదంతా యిలా వుంటో చూశావా రఘూ! శ్రీరాముడు శబరిఇంటికి వచ్చాడని చెబుతారు. అలావుంది. మీరు వెళ్ళిపోతున్నారు. నేనేం చెయ్యను! తువ్వాలవ్యాపారంలో ఏం మిగుల్తుంది! అక్కడికక్కడికే సరిపోతుంది. ఈ రెండేళ్ళుగా నేను మిగిల్చిందల్లా ఈ కొంగులోనే వుంది. ఊరు పొమ్మంటూ, కాడు రమ్మంటూన్న కాలంలో నాకీ బరువెందుకు! తీసుకెళ్ళు. దీంతో మరేం పెద్దగ రాదు. పావని మువ్వల కడియాలు చేయించి కాళ్ళకి వేయించు. అది నడిచినప్పుడల్లా మువ్వలు ఘల్లుఘల్లు మంటుంటాయి. అప్పుడల్లా మీరు నేను జ్ఞప్తికొస్తుంటాను. ఈ ముసలితనంలో నన్ను తలచుకునేవాళ్ళు ఒకరిద్దరయినా వున్నారనుకుంటే నేను తృప్తిగా చావగలను" అంటూ కొంగుముడి విప్పి చిల్లర డబ్బుల్ని పావ ఒడిలో పోసింది.

రఘు అమ్మమ్మ దగ్గరనుంచి పావని తీసుకున్నాడు. సుశీల బామ్మకు నమస్కరించి సెలవు తీసుకుంది. అంతకంతకూ దూరంగా వెళ్ళిపోతున్న ఆ సతీపతుల్ని చూస్తూ కామాక్షమ్మ ఆ గుడిసె తలుపుదగ్గరే నిలుచుండిపోయింది.

★

## దైవలిఖితం

మారిపోయింది. తన భార్యను మళ్లీ యథాప్రకారం చేజిక్కించుకున్నందుకు సంతృప్తిపడ్డాడు. అప్పటినుండీ వాళ్లు ముగ్గురూ-తీరని దారిద్ర్యంతో భిక్షమెత్తి జీవిస్తూనే వున్నారు.

ఆకాశవీథిలో వున్న పార్వతీపరమేశ్వరులు, బ్రాహ్మణకుటుంబంలో జరిగిన మార్పులన్నీ చూస్తూనే వున్నారు. ఆఖరికి తను ఇచ్చివచ్చిన వరాలు ఫలించక పోవడం గమనించి, పార్వతి చిక్కమొహం పెట్టింది. "చూశావా పార్వతీ! నువ్వు వాళ్లకు వరాలిచ్చి వచ్చినా, వాళ్ల స్థితి ఏమయిందో! వాళ్ల విధిలిఖితం అలా వుంటే - మనం ఏం సహాయం చేసినా అది ఫలించదని నేనప్పుడే చెప్పానా?- ఏదీ విధిలిఖితంప్రకారమే జరిగితీరుతుంది. దాన్ని మార్చడమంటే నీ వల్లా కాదు; నావల్ల గూడా కాదు!" అన్నాడు పరమేశ్వరుడు. చెప్పిన మాట వినని పార్వతీదేవి, జరిగిన అవమానానికి కాస్త కోప్పడి "సరేలెండి; ఈ విషయాన్ని మరీ మరీ చెప్పి పొడిపించడం దేనికీ!? రండి, పోదాం!" అంది. ★

---

## సాగరగర్భంలో సాహసయాత్ర

(52-వ పేజీ తరువాయి)

మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చును. అయితే, వాళ్ళిద్దరు స్పెయిను దేశస్థులో, టర్కీదేశస్థులో, అరేబియా దేశస్థులో లేక ఇండియా దేశస్థులో అయి ఉండాలి. అంతకన్న నిర్ధారణగా తేల్చిచెప్పడం చాలాకష్టం! ఇంక వాళ్లు మాట్లాడే భాషేమిటో ఏమీ తెలియడంలేదు."

"ప్రపంచానికంతటికీ ఒకే ఒక భాష లేకపోవడంమూలాన ఇలాటి ఇబ్బందులే వస్తూంటాయి." అన్నాడు కౌన్సిల్.

"సరే! దానికేమి గాని వాళ్లంతా మాట్లాడే భాష వాళ్ళలో వాళ్లు కల్పించుకున్న భాషలాగే ఉంది. అయితే ప్రపంచంఅంతటా అర్థం చేసుకునే సంజ్ఞలున్నాయి కదా! ఆ సంజ్ఞలతో మన ఆకలి సంగతి వాళ్ళకి తెలియచెయ్యవచ్చునే!" అన్నాడు నెడ్‌లాండ్.

"అయితే వాళ్ళకి ఆ మాత్రం తెలివితేటలుకూడా ఉన్నట్టు కనబడదే!" అని సమాధానంచెప్పాడు కౌన్సిల్.

అతడు ఆ మాటలు అంటూండగానే గది తలుపులు తెరుచుకున్నాయి. ఒక నౌఖరు లోపలికి వచ్చాడు. అతని చేతుల్లో చిత్రచిత్రమైన దుస్తులున్నాయి. అవి వాళ్లు ధరించే దుస్తుల బాపతే. మేమంతా వెంటనే అవి ధరించాము. నౌఖరు వెనువెంటనే మా కందరికీ భోజనాలు వడ్డించాడు. ధోరణిబట్టి చూస్తే అతగాడు వట్టి మూగ, చెవిటీ అయి ఉండవచ్చునని అనిపించింది.

ఆ భోజన పదార్థాలు, అన్నీ చూస్తూంటే మేమేదో జమీందారుల హోటల్లో భోజనానికి కూర్చున్నామా? అనిపించింది. భోజన పదార్థాల్లో అతి ముఖ్యమైనవి— రొట్టెలు, వైను మాత్రం లేవు! అంతే! మంచినీళ్ళ సప్లయి కేమీ లోటు లేదు! ఇక మిగిలినవాటిల్లో వేశ్వేరు జాతుల చేపలు వండి తయారుచేసిన చిత్ర చిత్రమైన వంటకాలెన్నెన్నో ఉన్నాయి. కొన్ని కొన్ని వంటకాలు చాలా రుచిగా ఉన్నాయి గాని వాటి పేర్లు కూడా నాకు తెలియవు. అంతటి అపురూపమైన వంటకాలవి!

భోజనపాత్రలన్నిటిమీద 'ఎన్' ఆకారంలో ఒక అక్షరం కనిపించింది. బహుశః అది ఆ జలాంతర్గామి సర్వాధికారి పేరై ఉండవచ్చును.

మొట్టమొదట నెడ్‌లాండు, కౌన్సిలు ఇవేవీ తిన్నగా పరిశీలించనే లేదు. భోజనపదార్థాలన్నీ అదే పనిగా ఆరగించడం మొదలపెట్టారు. కొంతసేపటికి నేనుకూడ ఆ ధోరణిలో పడిపోయాను.

సుష్టుగా భోజనంచేసి కూర్చున్నా సరికి మా కందరికీ నిద్ర వచ్చింది. నా స్నేహితులిద్దరు నేలమీద పరచిన కంబళీమీద పడుకుని హాయిగా నిద్ర పోయారు. నా కంత సులభంగా నిద్రపట్టలేదు. అల్లాగే కళ్లు తెరుచుకుని కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టాను. బుర్రలో ఎన్నెన్నో ప్రశ్నలు బయలుదేరాయి. మేమంతా ఎక్కడున్నాము? ఈ విచిత్రవ్యక్తులంతా ఎవరు? మా జలాంతర్గామి క్రమక్రమంగా సాగరం అట్టడుగు భాగంలోనికి మునిగిపోతున్నదని అనిపించింది. అటుపిమ్మట నా గుండెల్లో ఏదో పెద్ద బరువు మోపినట్టయింది. మా జలాంతర్గామి సాగరగర్భంలో నివసించే చిత్రచిత్రమైన జలజీవాలమధ్యనించి వెళ్ళిపోతున్నదని అనిపించింది. క్రమక్రమంగా నా హృదయం నిమ్మకు నీరెత్తినట్టయిపోయింది. నా భావన నీలినీలి నిద్రాతరంగాలుగా మారిపోయింది. నేనాతరవాత హాయిగా గుర్రుపెట్టి నిద్రపోయాను.

—ఇంకా ఉంది.

---

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.